క్లుప్తంగా

డాక్టరేట్ ప్రదానం



నిర్మలాదేవి

కర్నూలు కల్చరల్: కర్నూలు జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఫిజిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఈడిగ నిర్మలాదేవి రాయలసీమ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. 'జింక్ ఆక్సైడ్ టైటానియం ఆక్సైడ్ నానో కణాల అధిక దిగుబడి సంశ్లేషణ వాటి అనువర్తనాలు' అనే అంశంపై అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ తోట సుబ్బారావు పర్యవేక్షణలో ఈమె చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. డాక్టరేట్ పొందిన నిర్మలాదేవికి ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, హ్యుమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ కేవీ గోపాలకృష్ణ శాస్త్రి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

సీనియర్ అసిస్టెంట్ మృతి



స్వరూప్ (ఫైల్)

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రెడ్డిపోగు చంద్రహాస స్వరూప్ (57) సోమవారం సాయంత్రం మృతిచెందారు. ఆయన గత కొంతకాలంగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఏపీ ఎన్జీఓ అసోసియేషన్‌లో సిటీ జాయింట్ సెక్రటరీగాను కొనసాగుతున్నారు. గతంలో ఆయన వైద్య ఆరోగ్య శాఖలోనూ కొన్ని సంవత్సరాల పాటు జూనియర్ అసిస్టెంట్‌గా, సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించారు. ఆయన మరణం పట్ల ఆసుపత్రి అధికారులు, ఉద్యోగులు సంతాపం తెలిపారు.

బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో పాల్గొన్న బ్రాహ్మణ నేతలు

కర్నూలు(అర్బన్): బ్రాహ్మణులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా తదితర అన్ని రంగాల్లో రాణించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటరామరాజు ఆకాంక్షించారు. సోమవారం స్థానిక సరస్వతీ దేవి ఆలయంలో గాయత్రీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రామరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను పొందేందుకు అర్హత ఉన్న బ్రాహ్మణులందరూ ఆయా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్రాహ్మణ కో-ఆపరేటివ్ సొసైటీలో సభ్యత్వం తీసుకొని పథకాల ద్వారా లబ్ధి పొందాలన్నారు. బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యోగేంద్రనాథ్, కాళి ప్రసాద్, గాయత్రీ బ్రాహ్మణ సంఘం నాయకులు హనుమంత రావు, శిరీష, శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నమయ్య జయంతి



అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో సోమవారం పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారపేట శ్రీ సూర్య కళా అకాడమీ కళాకారులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు అలరించాయి. లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు. అలాగే దండెగేరిలోని సీతారామాలయం కమిటీ ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కర్నూలు శారదా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల విశ్రాంత అధ్యాపకులు సి.సరస్వతమ్మ పర్యవేక్షణలో సంగీత కళాకారులు అన్నమయ్య సప్తగిరి సంకీర్తనలు ఆలపించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బేకారి కట్ట, గరీబ్ నగర్ పేర్లను కొనసాగించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వార్డు ప్రజలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని పాతబస్తీలో బేకారి కట్ట, గరీబ్ నగర్ పేర్లను యథావిధిగా కొనసాగించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ జోనల్ ఇన్‌చార్జ్ కిషన్ డిమాండ్ చేశారు. స్థానిక నగరపాలక సంస్థ ఎదుట సోమవారం బేకారి కట్ట, గరీబ్ నగర్‌కు చెందిన కాలనీవాసులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 150 నుంచి 200 సంవత్సరాలుగా పూర్వీకుల నుంచి బేకార్ కట్ట, గరీబ్ నగర్ అనే పేర్లతో పిలుస్తున్నారన్నారు. తమకు తెలియకుండా, వార్డు ప్రజలకు చెప్పకుండా ఆయా వీధుల పేర్లను మార్చుచేసేందుకు ఏకపక్షంగా నిర్ణయం ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. కౌన్సిల్ తీర్మానం చేసి వీటి పేర్లను మారుస్తున్నట్లు తమకు తెలిసిందన్నారు. నగరపాలక సంస్థ అధికారులు పేర్ల మార్పు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. అనంతరం కమిషనర్ ఎస్.రవీంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానికులు వశీం, షేక్ అహమ్మద్, షాకీర్, బాసిద్, జహంగీర్, జుగుల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు



బీఆర్‌రెడ్డి కాలనీలో రోడ్డుపై గుంతలు



లక్ష్మీపురం రోడ్డు దుస్థితి

కల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో రోడ్లు బాగు చేస్తామని ఆ పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. ఇంటింటికీ వెళ్లి ఊదరగొట్టారు. అయితే అధికారం చేపట్టి పదకొండు నెలలు గడిచినా రోడ్లు ఎక్కడ వేశారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కర్నూలు నగరంలో 52 వార్డులు సుమారుగా 6.5 లక్షల జనాభా ఉన్నారు. ఇందులో 16 వార్డులు పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్ పరిధిలో ఉన్నాయి. కల్లూరు అర్బన్ ప్రాంతం రోజు రోజుకు విస్తరిస్తోంది. 16 వార్డుల నుంచి ప్రజలు మున్సిపాలిటీకి వివిధ రకాల పన్నులు చెల్లిస్తున్నారు. అయితే ఆయా కాలనీల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

– 44వ జాతీయ రహదారి నుంచి కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురం గ్రామానికి వెళ్లే రోడ్డు అడుగుకో గుంత అన్నట్లుగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం లక్ష్మీపురం, దొడ్డిపాడు గ్రామాల ప్రజలు, వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తుంటారు. ఈ దారి వెంట ప్రయాణించాలంటే నరక ప్రాయంగా ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– బీఆర్ రెడ్డి కాలనీ, 37, 41వ వార్డులోని వీకర్ సెక్షన్ కాలనీలో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఈ కాలనీలో ఎక్కువ శాతం మధ్య తరగతికి చెందిన ప్రజలు నివాసం ఉంటున్నారు. రోడ్లపై గుంతలు ఏర్పడటంతో పాటు రోడ్డు మధ్యలో నెర్రలు ఇచ్చాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా కాలనీ వాసులు వాపోతున్నారు.

రోడ్డును బాగు చేయండి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్లు, కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. దారంతా గుంతలమయంగా మారింది. సుమారుగా పది నెలలు అవుతున్నా రోడ్డు గురించి పట్టించుకోవడం లేదు. రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కింద పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. అధికారులు స్పందించి 44వ జాతీయ రహదారి నుంచి లక్ష్మీపురం వరకు రోడ్డును నిర్మించాలి.

– ఇప్పల శేషారెడ్డి, లక్ష్మీపురం

వసతులు కల్పించాలి



కల్లూరు అర్బన్ 28వ వార్డు పరిధిలో రోడ్లు సరిగా లేవు. మెయిన్ రోడ్డు అధ్వానంగా మారింది. బీఆర్ రెడ్డి కాలనీలో మున్సిపల్ అధికారులు మౌలిక వసతులు కల్పించడం లేదు. తాగునీరు, పారిశుద్ధ్యం నిర్వహణ సక్రమంగా లేదు. అధికారులు స్పందించి కాలనీలో సమస్యలను పరిష్కరించాలి.

– ఎస్.రవిచంద్ర, బీఆర్ రెడ్డి కాలనీ

నర్సుల సేవలు అమూల్యం



అధికారులు, నర్సులతో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రుల్లో రోగులకు నర్సులు అందించే సేవలు అమూల్యమైనవని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కొనియాడారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ నర్సుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ధన్వంతరి హాలులో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ.. ఆసుపత్రిలో చేరిన రోగులు జాగ్రత్తగా ఇంటికి వెళ్లే వరకు కంటికి రెప్పలా కాపాడే వారే నర్సులన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగల్ రెడ్డి, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ.కాశన్న, ఎం.రామకృష్ణ, నాయకులు షమీవుల్లా, ప్రభాకర్‌రెడ్డి, కేసీహెచ్ కృష్ణుడు, నర్సింగ్ సూపరింటెండెంట్లు సావిత్రిబాయి, విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నర్సుల దినోత్సవం

కర్నూలు(హాస్పిటల్): ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి పురస్కరించుకుని సోమవారం కర్నూలులోని ఆయుష్మాన్ నర్సింగ్ కాలేజీ, మదర్ థెరిస్సా స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి.సలోమి మాట్లాడుతూ.. రోగులకు ఎంతో ఓదార్పునిచ్చే, పరిమితులు లేకుండా శ్రద్ధ వహించే పని కేవలం నర్సుల వల్లే సాధ్యం అని చెప్పారు. అధ్యాపకులు పి.స్వాతి చంద్రిక, జీఎల్.ప్రసన్నకుమారి, ఎస్.రేష్మ, బోధనేతర సిబ్బంది శ్రావణి,విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు(హాస్పిటల్): స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్స వం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 సావిత్రిబాయిని సన్మానించారు. హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ నర్సుల సేవలను కొనియాడారు.

17 నుంచి ఉచిత శిక్షణ తరగతులు

కర్నూలు కల్చరల్: హైదరాబాద్ ఇన్‌కంట్యాక్స్ అడిషనల్ కమిషనర్ ఐఆర్ఎస్ బి.యాదగిరి ఆధ్వర్యంలో అమీలియో హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ చాపే నిర్వహణలో ఈనెల 17వ తేదీ నుంచి వివిధ అంశాలపై ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కోర్సు డైరెక్టర్, ఆర్‌వీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, ఆర్గనైజింగ్ చైర్మన్ పి.దీక్షిత్ పేర్కొన్నారు. ఎన్ఆర్ పేటలోని శ్రీలక్ష్మీ పాఠశాలలో జూన్ 6వ తేదీ వరకు 21 రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. శిక్షణలో పాల్గొనేవారికి ఉచిత స్టడీ మెటీరియల్ ఇవ్వడంతో పాటు మధ్యాహ్నం భోజన వసతి, దూర ప్రాంతాల వారికి ఉచిత హాస్టల్ వసతి ఉంటుందని వెల్లడించారు. వివరాలకు 91777 64147, 96409 69891 నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

30 నుంచి ఆన్‌లైన్ భగవద్గీత తరగతులు

కర్నూలు కల్చరల్: లర్న్ గీత సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి భగవద్గీత ఉచిత ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 20 రోజుల్లో 2 అధ్యాయాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. పఠన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి గీతా గుంజన్ ఇ-ప్రశస్తి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. వారానికి 5 రోజుల పాటు రోజూ 40 నిమిషాల చొప్పున 21 టైమ్ స్లాట్‌లలో శిక్షణ ఉంటుందని వివరించారు. ఎంపిక చేసిన 13 భాషల్లో ఇష్టమైన భాషలో శిక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. వివరాలకు http://joingeeta.com వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. మరిన్ని వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్ 1800-203-6500ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

దొంగ అరెస్ట్



దొంగను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కర్నూలు(అర్బన్): కర్నూలు మండలం ఆర్ కొంతలపాడు గ్రామంలోని కురువ శ్రీనివాసులు ఇంట్లో ఈ నెల 7న చోరీ చేసిన కేసులో దొంగ షేక్ అబ్దుల్ కలాం అలియాస్ మచ్చను పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.7.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ బాబూ ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక తాలూకా యుపీఎస్‌లో వివరాలను వెల్లడించారు. అందిన సమాచారం మేరకు కోడుమూరులో నివాసం ఉంటున్న కృష్ణగిరి మండలం పోతుగల్లుకు చెందిన షేక్ అబ్దుల్ కలాం అలియాస్ మచ్చను మునగాలపాడు సమీపంలోని తిప్పమ్మ కొట్టం వద్ద సోమవారం సీఐ ఎం శ్రీధర్, ఎస్ఐ ఎన్ రామాంజనేయులు తమ సిబ్బందితో అరెస్ట్ చేశారు. గూడురు ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు దొంగ ఆచూకీ తెలుసుకొని అరెస్ట్ చేశామని డీఎస్పీ తెలిపారు.

దేశ భక్తి కలిగి ఉండాలి



భరత మాత పోస్టర్‌కు పాలాభిషేకం చేస్తున్న రచయిత్రులు

కర్నూలు కల్చరల్: చదువుతోపాటు చిన్న తనం నుంచే పిల్లల్లో దేశభక్తిని నేర్పాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జై జవాన్ కల్చరల్ ఫెస్టివల్‌లో భాగంగా మూడో రోజు సోమవారం దేశ భక్తి నృత్య ప్రదర్శనలు, గేయాల ఆలాపన జరిగింది. నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం సభ్యులు భరత మాత చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం నిర్వహించిన కవయిత్రుల సమ్మేళనం అలరించింది. గాయకురాలు సుజాత ఆలపించిన దేశ భక్తి గీతాలు, కరీముల్లా శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు దేశభక్తిని రగిల్చాయి. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు, కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడారు. నరసం కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవులు, రచయితలు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి



ఎన్జీఓ నాయకులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు


కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు త్వరగా చేపట్టాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లును ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం సూపరింటెండెంట్‌ను కలిసి పలు సమస్యలపై చర్చించారు. కారుణ్య నియామకాల్లో ఉన్న అడ్డంకులు తొలగించి నియామకాలు త్వరగా చేపట్టాలని కోరారు. ఆసుపత్రిలో కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్న స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని, నర్సింగ్ అసోసియేషన్‌కు భవనం కేటాయించాలని కోరారు. అసోసియేషన్ నగర అధ్యక్షుడు కాశన్న, కార్యదర్శి రామకృష్ణ, నాయకులు శ్రీనివాసులు, చిరంజీవి, కృష్ణుడు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిపై పోలీసు జులుం తగదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు రాఘవేంద్రనాయుడు

కర్నూలు (టౌన్): బీసీ మహిళ, మాజీ మంత్రి విడదల రజినీ పట్ల పోలీసు జులుం తగదు. మహిళ పట్ల అనుచితంగా ప్రవర్తించిన చిలకలూరిపేట సీఐ సుబ్బరాయుడుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో పోలీసు శాఖ పనితీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుచేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారిపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారన్నారు. రెండు రోజుల క్రితం చిలకలూరిపేటలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడిని అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలిస్తున్న విషయం తెలుసుకుని మాజీ మంత్రి విడదల రజినీ అక్కడికి వెళ్లి ఎందుకు అరెస్టు చేస్తున్నారని ప్రశ్నించడంతో సీఐ సుబ్బరాయుడు రెచ్చిపోయి అమానవీయంగా ప్రవర్తించాడన్నారు. మహిళ, మాజీ మంత్రి అని తెలిసినా దౌర్జన్యం చేశాడన్నారు. రాష్ట్ర ప్రజలందరూ ప్రభుత్వ పనితీరు, పోలీసు శాఖ పనితీరును చూస్తున్నారన్నారు. ఇష్టానుసారంగా కేసులు పెట్టడం, రెండు, మూడేళ్ల నాటి చిన్న కేసులను సాకుగా చూపి ఎంతో మందిని అరెస్టు చేసిన విషయం అందరికీ తెలుసన్నారు. అధికారం శాశ్వతం కాదని, మాజీ మంత్రిపై దురుసుగా ప్రవర్తించిన సీఐపై చర్యలు తీసుకొని పోయిన ప్రభుత్వ పరువును కాపాడుకోవాలని హితవు పలికారు. ఏడాది కాలంగా ప్రభుత్వం నిద్రావస్థలో ఉందని, ఏ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని, ప్రశ్నిస్తున్నందుకే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. కూటమి నిరంకుశ పాలనపై ప్రజలే తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రవణ్‌కుమార్, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు భీమేష్, బీసీ సెల్ నగర అధ్యక్షుడు బబ్లూ, నగర ఐటీ విభాగం అధ్యక్షుడు నరేంద్ర, చేనేత విభాగం నగర అధ్యక్షుడు కంఘూ, చికెన్ వలి పాల్గొన్నారు.



ఏడాదికోసారి మాత్రమే పుష్పించే అరుదైన మే పుష్పం ఒకటి సోమవారం విరబూసింది. కర్నూలు సి.క్యాంప్‌లోని విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సురేంద్ర నివాసంలో మే పుష్పం వికసించడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద బంకులను తొలగించండి

- అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ కాల్వ పనులు పూర్తి చేయండి
- కమిషనర్‌కు పలువురు వినతులు



కమిషనర్ రవీంద్రబాబుకు సమస్యలు విన్నవిస్తున్న కాలనీ వాసులు

కర్నూలు (టౌన్): నగరంలోని మద్దూర్ నగర్ మున్సిపల్ కాంప్లెక్స్ షాపు నంబర్ 18 వద్ద డ్రైనేజీ కాల్వ లేదని, పక్కన అనుకొని ఏర్పాటు చేసిన బంకులను తొలగించాలని షాపు లీజుదారులు జి.హనుమంతమ్మ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థలో కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తన చాంబర్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. పలువురు కమిషనర్‌కు తమ వినతులు అందజేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఇన్‌చార్జ్ ఎస్ఈ శేషసాయి, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- ఎల్బీజీ నగర్‌లో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ కాల్వ పనులను పూర్తి చేయాలని స్థానికులు రహంతుల్లా, అబ్దుల్ సలాం విన్నవించారు.
- తమ నివాసాల వద్ద సీసీ డ్రైన్ కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నామని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన షేక్ ఫారుఖ్ తదితరులు వినతిపత్రం ఇచ్చారు.
- టిడ్కో గృహం కోసం తన దరఖాస్తు ఉపసంహరించుకున్నందున తాను చెల్లించిన డీడీ నగదును వాపస్ ఇప్పించాలని మద్దయ్య విన్నవించారు.

సీహెచ్‌ఓలను బెదిరించడం సరికాదు



రాజ్‌విహార్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రవ్యాప్తంగా రెండు వారాలుగా తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న సీహెచ్‌ఓలను బాధ్యత గల మంత్రి హోదాలో ఉన్న రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. కర్నూలులోని ధర్నా చౌక్‌లో సీహెచ్‌ఓలు చేస్తున్న ఆందోళన సోమవారానికి 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు ర్యాలీ నిర్వహించి రాజ్‌విహార్ వద్ద మానవహారంగా ఏర్పడి రాస్తారోకో నిర్వహించి నినాదాలు చేశారు. వీరికి ఏఐటీయూసీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ.. మంత్రి హోదాలో ఉన్న వ్యక్తి సీహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించకపోగా బెదిరించడం తగదన్నారు. ఆరు సంవత్సరాల సర్వీసు దాటిన సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలని, ఎన్‌హెచ్‌ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రతి నెలా జీతంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని, ప్రతి సంవత్సరం 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఆర్థికమైన, ఆర్థికేతర సమస్యలను తీర్చే విధంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీఎంసీఏ జిల్లా అధ్యక్షురాలు చందన, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేంద్రప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, ట్రెజరర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ క్యాంటీన్‌కు తాళాలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలోని క్యాంటీన్‌కు ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు సోమవారం షెట్టర్ మూసి తాళాలు వేశారు. ఈ సందర్భంగా సంఘం కేఎంసీ శాఖ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్ మాట్లాడుతూ.. క్యాంటీన్ అగ్రిమెంట్‌ను ఫోర్జరీ చేసి డాక్టర్ వరప్రసాద్ 30 ఏళ్ల పాటు లీజుకు రాయించుకున్నారని విమర్శించారు. ఐదేళ్లు ఉన్న అగ్రిమెంట్‌ను 30 ఏళ్లకు దిద్దుకుని కొనసాగుతున్నారని, పైగా ఆయన సంఘంలో సభ్యులుగా కూడా లేరని, ఈ జిల్లాలోనూ పనిచేయడం లేదన్నారు. ఇలాంటి వ్యక్తి క్యాంటీన్‌ను ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఈ మేరకు క్యాంటీన్‌ను స్వాధీనం చేసుకునేందుకు వారం రోజుల క్రితం నోటీసులు ఇచ్చామని, చర్చలకు రమ్మని ఆహ్వానించామన్నారు. అయితే ఎలాంటి స్పందన లేకపోవడంతో క్యాంటీన్‌ను మూసివేసి తాళాలు వేశామన్నారు. ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం బైలా ప్రకారం క్యాంటీన్‌ను అసోసియేషన్ నిర్వహించాలన్నారు. త్వరలో అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి, క్యాంటీన్‌ను ఎవరు నిర్వహించాలో నిర్ణయిస్తామని తెలిపారు. సంఘం ట్రెజరర్ శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులు రంగయ్య, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: జిల్లాలో రూ.2 నుంచి రూ.25 లక్షల లోపు ఆదాయం ఉన్న దేవాలయాల పాలక మండళ్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా దేవదాయ శాఖ అధికారి సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ కమిషనర్ జిల్లాలోని 22 ఆలయాలకు నోటిఫికేషన్ జారీ చేశారని పేర్కొన్నారు. నోటిఫికేషన్ వచ్చిన రోజు నుంచి 20 రోజుల్లోగా ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను మద్దూరు నగర్‌లోని దేవదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై సమీక్ష



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు(సెంట్రల్): లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సమీక్ష నిర్వహించారు. సోమవారం కోర్టు కాంపౌండ్ పరిధిలోని న్యాయ సేవా సదన్‌లో ఆయన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, చట్టపరమైన సలహాలు, జైలు విజిట్లు, కేసుల వివరాలు, పరిష్కారం తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎన్ని కేసుల్లో బెయిళ్లను మంజూరు చేశారు, వాటి స్థితులపై ఆరా తీశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్/జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి ఆదేశాల మేరకు సమీక్ష చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఏ.సులోచన పాల్గొన్నారు.

తలసేమియాపై అవగాహన ఉండాలి



తలసేమియా గురించి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రఘు

కర్నూలు(హాస్పిటల్): తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారు, వారి కుటుంబసభ్యులు ఈ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి డాక్టర్ రఘు చెప్పారు. ఆయన సోమవారం నగర శివారులోని పంచలింగాల గ్రామంలో నిర్వహిస్తున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తలసేమియా వంశపారంపర్యంగా వచ్చే జన్యు సంబంధితమైన వ్యాధి అని తెలిపారు. తల్లిదండ్రుల నుంచి ఈ ప్రాణాంతక వ్యాధి సంక్రమిస్తుందన్నారు. వివాహం చేసుకోవాలంటే తప్పనిసరిగా తలసేమియా స్క్రీనింగ్ చేయించుకోవాలన్నారు. ఈ వ్యాధిగ్రస్తులలో రక్తహీనత వల్ల అలసట, నీరసం, శరీరంలో వాపులు రావడం, పచ్చకామెర్లు, వాంతులు, విరేచనాలు, శ్వాస సంబంధిత సమస్యలు వస్తాయన్నారు. వైద్యాధికారి డాక్టర్ మంజూష, ఆరోగ్య కార్యకర్తలు షీలా, వేణుగోపాల్, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.





వినాయక్‌ఘాట్ కేసీ కెనాల్‌పై రోడ్డుపైనే పండ్ల వ్యాపారం

చిరు వ్యాపారం.. ట్రాఫిక్ అస్తవ్యస్తం!

నగరంలో ఎక్కడ చూసినా రోడ్డు ఆక్రమణలే. అసలే ఇరుకు రోడ్లతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా ప్రధాన రహదారుల్లో తోపుడు బండ్ల నిర్వహణ ప్రతిరోజూ ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతోంది. అదేవిధంగా పండ్ల వ్యాపారులు రోడ్డును ఆక్రమించడం గమనార్హం. రాజ్‌విహార్ కూడలి నుంచి పాత బస్టాండ్‌కు వెళ్లే మార్గం, రాజ్‌విహార్ నుంచి సి.క్యాంప్ వరకు.. నంద్యాల చెక్‌పోస్టు.. కొత్త బస్టాండు.. తదితర ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల కారణంగా నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. వినాయకఘాట్ వద్ద పండ్ల వ్యాపారులకు ప్రత్యేకంగా షెడ్లు ఉన్నా అక్కడ వ్యాపారం చేసుకోకుండా రోడ్డుపైకి వస్తుండటంతో ఆ ప్రాంతమంతా రద్దీగా మారుతోంది. ఇక టిఫిన్ సెంటర్లు, చికెన్ పకోడీలు.. స్వీట్ దుకాణాలు.. ఇలాంటివన్నీ రోడ్లను ఆక్రమించుకొని నిర్వహిస్తుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నంద్యాల చెక్‌పోస్టు, బిర్లాగేట్ మార్గంలోని రెండు మద్యం దుకాణాల వద్ద మందుబాబులు ఇష్టారాజ్యంగా రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ విషయంలో అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



కేడీసీసీ బ్యాంక్ - సెంట్రల్ ప్లాజా దారిలో రోడ్డు మీదకు వచ్చేసిన చిరు వ్యాపారులు

